క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లి సమీపంలో శుక్రవారం సాయంత్రం జాతీయ రహదారి దాటుతుండగా లారీ ఢీకొని తీవ్రంగా గాయపడిన వడ్లమూడి సరోజినమ్మ (70) అదేరోజు అర్ధరాత్రి ఒకటిన్నర గంటల సమయంలో ఒంగోలులోని ఒక ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెను ఢీకొన్న లారీతో పాటు డ్రైవర్‌ను మద్దిపాడు ఎస్‌ఐ శివరామయ్య అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహానికి ఒంగోలు జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి ఆమె బంధువులకు అప్పగించారు.

వైఎస్సార్ సీపీ సమావేశాన్ని విజయవంతం చేయాలి

కొత్తపట్నం: ఒంగోలులో ఆదివారం జరగనున్న వైఎస్సార్ సీపీ ఒంగోలు విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి పిలుపునిచ్చారు. సమావేశానికి కొత్తపట్నం మండల నాయకులు, అనుబంధ కమిటీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, జెడ్పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయస్వామి మూలవిరాట్

కురిచేడు: మండలంలోని కాటంవారిపల్లెలో వేంచేసి ఉన్న శ్రీ అభయ ఆంజనేయస్వామి వార్షికోత్సవం శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ఉదయం నుంచి స్వామివారికి పొంగళ్లు తయారు చేసి నివేదించారు. స్వామి వారికి ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, అన్నదానం చేశారు. శనివారం రాత్రికి కోలాటం ప్రదర్శించారు.


ఆలయాల్లో భక్తుల సందడి



రామదూత క్షేత్రంలో అలంకరణలో శ్రీవారు

కొనకనమిట్ల: మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ అర్చకులు సింహాద్రీచార్యులు లక్ష్మీఅలివేలు మంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు వెంకటరామకృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సచివాలయం తనిఖీ



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో

కంభం: మండలంలోని ఎల్‌కోట గ్రామ సచివాలయాన్ని శనివారం ఎంపీడీవో వీరభద్రాచారి తనిఖీ చేశారు. హాజరుపట్టీ, మూమెంట్ రిజిస్టరు, ఇతర రికార్డులు పరిశీలించారు. యోగాంధ్ర సర్వేపై సిబ్బందికి సూచనలందించారు. గ్రామంలో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎన్‌జీవో హోమ్‌లో జరుగుతున్న కుట్టుమిషన్ల శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు.

జగనన్న పోరుబాటకు తరలిరావాలి

- వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పిలుపు



వైఎస్సార్ సీపీ సీతారాంపురం గ్రామ కమిటీ ఏర్పాటు సందర్భంగా ప్రజలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: పొగాకు రైతులకు అండగా నిలిచేందుకు జగనన్న పోరుబాట కార్యక్రమానికి ఈ నెల 28వ తేదీ పొదిలిలోని పొగాకు వేలం కేంద్రానికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న సందర్భంగా భారీగా పార్టీ శ్రేణులు తరలిరావాలని మాజీ మంత్రి, పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. మద్దిపాడు మండలంలోని సీతారాంపురం కొష్టాల సెంటర్ వద్ద శనివారం ఏర్పాటు చేసిన జగనన్న పోరుబాట సన్నాహక కార్యక్రమంలో అయన పాల్గొని మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెప్పిందే చేసిందని, కానీ, కూటమి ప్రభుత్వం మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. టీడీపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే పొగాకు రైతులను ఆదుకునేవారన్నారు. కానీ, అటువంటి పరిస్థితి ఆ పార్టీ నాయకులు, పాలకుల్లో కనిపించడం లేదన్నారు. రైతులను ఆదుకోలేని కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. పార్టీ మహిళా విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా సంతనూతలపాడు మండలం గురువారెడ్డిపాలేనికి చెందిన సన్నపరెడ్డి రమణమ్మను పార్టీ కేంద్ర కార్యాలయం ఎంపిక చేసినట్లు వర్తమానం వచ్చిందని సభలో మేరుగు నాగార్జున ప్రకటించారు. అనంతరం సీతారాంపురం గ్రామ కమిటీని ఆయన సమక్షంలో ఎంపిక చేశారు. గ్రామ అధ్యక్షునిగా చీరాల మాధవరావు, ఉపాధ్యక్షులుగా వత్సవాయి నరేంద్రవర్మ, కోల ఏసోబు, ప్రధాన కార్యదర్శులుగా సామంతపూడి గోపాలకృష్ణమరాజు, వడేల తిమోతి, గుణపాటి సాయి, మరికొందరు కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, నాదెండ్ల మహేష్, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకటరావు, మండల ఐటీ వింగ్ అధ్యక్షుడు అచ్యుత్, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీఆర్‌ఓలను తగ్గిస్తే పనిభారం

- కలెక్టర్‌ను కలిసి విన్నవించిన వీఆర్‌ఓ సంఘ నేతలు



కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందిస్తున్న విఆర్‌ఓల సంఘం నాయకులు

ఒంగోలు సబర్బన్: గ్రామ, వార్డు సచివాలయాల్లో మూడు, నాలుగు సచివాలయాలకు ఒక వీఆర్‌ఓను కేటాయిస్తే పనిభారం పెరుగుతుందని వీఆర్‌ఓల సంఘ నాయకులు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాకు విన్నవించారు. ఈ మేరకు శనివారం జిల్లా వీఆర్‌ఓల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రంగయ్య, ఆదిరెడ్డి ఆధ్వర్యంలో సంఘం నాయకులు కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. జిల్లాలో 1,055 మంది వీఆర్‌ఓలు ఉన్నారని, ప్రభుత్వ జీఓ ప్రకారం 353 మందిని మిగులు సిబ్బందిగా చూపించి ఉన్నారు. ఆ జీఓలో మిగులు సిబ్బందిని ఏ విధంగా సర్దుబాటు చేస్తారో చెప్పలేదన్నారు. ప్రస్తుతం ఉన్న వీఆర్‌ఓలకు అధికమైన ప్రభుత్వ పథకాల అమలు చేయడం కష్టంగా ఉంటుందని స్పష్టం చేశారు. సమస్యను ప్రభుతం దృష్టికి తీసుకువెళ్లి పాత విధానం ప్రకారం వీఆర్‌ఓలను సచివాలయాల్లో నియమించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జేసీ ఆర్ గోపాలకృష్ణను కలిసి కూడా వినతిపత్రం అందజేశారు. తరువాత ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు, అమరావతి జేఏసీ నాయకులు పిన్నిక మధుసూదన్‌ను, జిల్లా జనరల్ సెక్రటరీ వాసుదేవరావుతో పాటు రెవెన్యూ అసోసియేషన్ నాయకులను కూడా కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమాల్లో వీఆర్‌ఓ సంఘ జిల్లా అధ్యక్షుడు వైపీ రంగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏసీ ఆదిరెడ్డి, జీఎస్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ అజయ్‌కుమార్, జిల్లా ట్రెజరర్ కె.జానయ్య, రాష్ట్ర నాయకులు కె. రవికుమార్, ఒంగోలు డివిజనల్ అధ్యక్షుడు పి. చంద్రశేఖర్, కనిగిరి డివిజన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి శ్రీకాంత్, ఒంగోలు డివిజన్ కార్యదర్శి శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట రామయ్య, జిల్లా నాయకులు సురేష్ బాబు, రాజశేఖర్ రెడ్డి, ఒంగోలు మండల అధ్యక్షుడు ఎస్ దానిబాష , మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫారం పాండ్స్ నాణ్యత పరిశీలన



ముప్పావారిపాలెంలో పశువుల నీటితొట్టిని పరిశీలిస్తున్న చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపీనాథ్, అధికారులు

చీమకుర్తి రూరల్: మండలంలోని మంచికలపాడు, ముప్పావారిపాలెం గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల ద్వారా రైతుల పొలాల్లో తవ్వించిన రైతువారీ నీటి కుంటల నాణ్యతను చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి బి.గోపీనాథ్ పరిశీలించారు. శనివారం పలు గ్రామాలను సందర్శించి నాణ్యతను పరిశీలించిన అనంతరం మిగిలిన నీటి కుంటలను త్వరగా పూర్తి చేయాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో 314 ఫారం పాండ్స్ మంజూరవగా, 36 పూర్తయ్యాయని, 61 వివిధ దశల్లో ఉన్నాయని ఎంపీడీఓ రాఘవేంద్ర తెలిపారు. పశువుల నీటితొట్లు 14 మంజూరవగా, అన్నీ పూర్తయినట్లు తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఏపీడీ, ఏపీఓ రాఘవ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

2వ తేదీ నుంచి క్లాసులు ప్రారంభం



దొనకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల

దొనకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూన్ 2వ తేదీ నుంచి ఇంటర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతున్నాయని ప్రిన్సిపాల్ కె.దుసుమణి తెలిపారు. ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఈ ఏడాది ప్రథమ, ద్వితీయ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని, కళాశాల ఏర్పాటు చేసి 42 సంవత్సరాలు కావస్తోందని, ఉత్తమ ఫలితాలతో విద్యార్థులు ఉత్తీర్ణులవుతున్నారన్నారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత విద్యార్థులకు చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు. పశ్చిమ ప్రాంతంలోని వెనుకబడిన దొనకొండ ప్రాంతం విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

అదుపుతప్పి లారీ బోల్తా



బోల్తా పడిన కూరగాయల లోడు లారీ

పెద్దారవీడు: మండలంలో దేవరాజుగట్టు సమీపంలో కూరగాయల లారీ అదుపుతప్పి శనివారం బోల్తా పడింది. మదనపల్లె పట్టణం నుంచి ఒడిశా రాష్ట్రంలోని బరంపూర్‌కు వెళ్తున్న లారీ దేవరాజుగట్టు సమీపంలోకి రాగానే అదుపుతప్పి పడటంతో బాక్స్‌ల్లో ఉన్న టమోటాలు నేలపాలయ్యాయి. డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు కావడంతో వారిని వెంటనే స్థానికులు మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వీధిలైట్లు లేక ఇబ్బందులు



చీకటి కమ్ముకున్న బొద్దికూరపాడు బస్టాండ్ సెంటర్

తాళ్లూరు: దర్శి నియోజకవర్గంలో వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న పంచాయతీల్లో తూర్పుగంగవరం ముందు వరసలో ఉంటుంది. అలాంటి పంచాయతీలో పలు వీధుల్లో స్తంభాలకు ఉన్న వీధి లైట్లు వెలగగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన వాణిజ్య కేంద్రమైన తూర్పుగంగవరంలో రాత్రి వేళల్లో ప్రజలు తమ అవసరాల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. దీనిలో భాగంగా బొద్దికూరపాడు బస్టాండ్ సెంటర్ నుంచి హైస్కూల్ వరకు స్తంభాలకు వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి వేళ చీకట్లు కమ్ముకుంటున్నాయి. వీధి లైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో వైద్యం కోసం వస్తున్న మహిళలు, వృద్ధులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు వెంబడి ఆనుకుని ఉండే ఇళ్లల్లో నుంచి వచ్చే వెలుతురుతో ప్రజలు ఆ రోడ్డు మార్గాన వెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది. వెంటనే పంచాయతీ అధికారులు స్పందించి స్తంభాలకు వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

ఒంగోలు సబర్బన్: పంచాయతీల పాలనలో ఉన్న సమస్యలు పరిష్కరించడంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకట నాయుడు కార్యాలయం పూర్తిగా వైఫల్యం చెందిందని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి. వీరభద్రాచారి ధ్వజమెత్తారు. సంఘ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పంచాయతీల్లో రాజకీయ సమస్యలు సృష్టించడంలో మాత్రం డీపీఓ పూర్తిగా విజయవంతం అయ్యారని ఆయన అభిప్రాయపడ్డారు. సర్పంచులు గ్రీవెన్స్‌లో పెట్టిన అనేక ఫిర్యాదులు మూలన పెట్టారని చెప్పారు. గ్రామాల్లో కనీసం ఇంటి పన్ను కట్టని వ్యక్తులు స్వార్థ రాజకీయ కోణంలో ఫిర్యాదు చేస్తే దానిపై క్షణాల్లో స్పందిస్తున్న డీపీఓ తీరు అభ్యంతరకరమన్నారు. ఎటువంటి నిబంధనలు పాటించకుండా సర్పంచుల చెక్ పవర్ తీసేస్తున్న జిల్లా పంచాయతీ కార్యాలయం నిర్ణయాలపై కలెక్టర్ ప్రత్యేక విచారణ చేయాలని వీరభద్రాచారి డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ నుంచి కొంతమంది సిబ్బందిని అక్రమంగా నియమించుకుని దందా సాగిస్తున్న తీరు పంచాయతీరాజ్ వ్యవస్థకు, ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్న విషయం తెలుసుకోవాలని హితవు పలికారు. త్వరలో జిల్లాలో ఉన్న సమస్యలపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌ను, కమిషనర్ కృష్ణతేజను కలసి ఫిర్యాదు చేస్తామన్నారు.

పోలీస్‌స్టేషన్లో కళ్లు తిరిగి పడిపోయిన మహిళ

- వెంటనే జీజీహెచ్‌కు తరలించిన పోలీసులు
- గత 5 నెలలుగా పోలీసు స్టేషన్‌చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం

ఒంగోలు టౌన్: ఆస్తి వివాదానికి సంబంధించిన కేసులో పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్న ఒక మహిళ కళ్లు తిరిగి పడిపోవడంతో కలకలం రేగింది. బాధితురాలి కుమార్తె కథనం ప్రకారం...నగరంలోని రంగుతోటకు చెందిన జాజం సరస్వతికి ఆమె భర్త జాజం శ్రీనివాసరావుకు మధ్య కొంతకాలంగా ఆస్తి వివాదం కొనసాగుతోంది. ఈ వివాదంలో కూతురు జ్యోత్స్న తల్లి వైపు నిలవగా, కుమారుడు కిరణ్, అతడి భార్య సురేఖ తండ్రికి మద్దతుగా నిలిచారు. శ్రీనివాసరావు ఆయన కుమారుడు కిరణ్ కలిసి ఆస్తి రాయించుకోవడమే కాకుండా, సరస్వతి, జ్యోత్స్నల వద్ద ఉన్న మొత్తం బంగారాన్ని కుదువపెట్టేశారు. కొత్తగా కొనుగోలు చేసిన ప్లాట్ కూడా వారి పేరుతో రిజిస్టర్ చేయించుకున్నారు. ఈ విషయంలో సరస్వతి గత జనవరి నెలలో టూటౌన్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పోలీసుస్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. ఎప్పటిలాగే సరస్వతి కూతురు జ్యోత్స్నతో కలిసి శనివారం ఉదయం టూటౌన్ పోలీసు స్టేషన్‌కు వచ్చి సీఐ మేడా శ్రీనివాసరావుతో మాట్లాడారు. మధ్యాహ్నం భోజన సమయం కావడంతో సాయంత్రం రండి మాట్లాడుదామని చెప్పి పంపించారు. తిరిగి సాయంత్రం 6.30 గంటల సమయంలో పోలీసుస్టేషన్‌కు వచ్చిన సరస్వతి కొద్ది సేపటి తరువాత కళ్లు తిరిగి పడిపోయారు. దాంతో ఆమెను పోలీసులు హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె స్పృహలో లేదని కూతురు జ్యోత్స్న తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశం

ఒంగోలు టౌన్: వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం సాయంత్రం 4.30 గంటల జరుగుతుందని ఆ పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకరరావు తెలిపారు. శనివారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తొలుత జిల్లా కార్యాలయంలోనే సమావేశం నిర్వహించాలని నిర్ణయించామని, కానీ, వర్షాలు కురుస్తుండటంతో వేదికను దక్షిణ బైపాస్‌లోని సాయి ఐటీఏ కన్వెన్షన్‌లోకి మార్చామని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. పార్టీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవిబాబు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, పార్లమెంటరీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్, ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు. అలాగే, విశిష్ట అతిథులుగా మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, మాజీ ఎమ్మెల్యేలు కుందురు నాగార్జునరెడ్డి, బుర్రా మధుసూదన్‌యాదవ్, కనిగిరి నియోజకవర్గ సమన్వయకర్త దద్దాల నారాయణయాదవ్, రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు కదిరి బాబూరావు, కసుకుర్తి ఆదెన్న, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మాదాసి వెంకయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి పాలడుగు రాజీవ్ పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, మాజీ డైరెక్టర్లు, డివిజన్, గ్రామ కమిటీ నాయకులు, మహిళా నాయకులు, వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ వలంటరీ విభాగం అధ్యక్షుడు ఎస్.జనార్దనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకరరావు

అంబేడ్కర్ విగ్రహం ఊరేగింపును అడ్డుకోవడమా

- దళిత మంత్రి ఇలాకాలో ఇదేం సంస్కృతి
- అడ్డుకున్న పెత్తందార్లపై కేసు నమోదు చేయాలి
- ఎస్సైని తక్షణమే సస్పెండ్ చేయాలి
- కేవీపీఎస్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రఘురాం

ఒంగోలు టౌన్: దళిత మంత్రి డోలా బాలాంజనేయస్వామి సొంత నియోజకవర్గంలో రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ఊరేగింపును అడ్డుకున్న పెత్తందార్లపై వెంటనే కేసు నమోదు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో శనివారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు వి. మోజెస్ అధ్యక్షత జరిగిన సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురాం మాట్లాడుతూ..జరుగుమల్లి మండలం కె.బిట్రగుంటలో అంబేడ్కర్ విగ్రహం ఊరేగింపును వ్యతిరేకించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందన్నారు. ఘటన జరిగిన సమయంలో సీఐ, ఎస్సైలు అక్కడే ఉన్నా రాజకీయ ఒత్తిళ్ల మేరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చాలా దారుణమన్నారు. బాధ్యులపై కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహించడం సిగ్గుచేటని విమర్శించారు. వెంటనే కలెక్టర్ జోక్యం చేసుకోవాలని, జాయింట్ కలెక్టర్ ద్వారా సమగ్రమైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ..ప్రపంచమంతా అంబేడ్కర్ జయంతులు జరుగుతుంటే ప్రకాశం జిల్లాలోని జరుగుమల్లి మండలం కె. బిట్రగుంటలో మాత్రం అధికారపార్టీ అండదండలతో అగ్రకులహంకారం రంకెలు వేస్తుందని ధ్వజమెత్తారు. ఇది కూటమి ప్రభుత్వం నియంతృత్వానికి నిదర్శనమని చెప్పారు. ఇలాంటి దారుణమైన చర్యలు జరుగుతుంటే మంత్రి ఏం చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా మాల ఉద్యోగుల సంఘం జేఏసీ కొప్పోలు ఏడుకొండలరావు మాట్లాడుతూ...దళితులకు అవమానం జరుగుతున్నా పట్టించుకోవపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహ ఊరేగింపును అడ్డుకున్న వారిపై కేసు నమోదు చేయడానికి పోలీసులకు వచ్చిన ఇబ్బందులు ఏంటో చెప్పాలని ప్రశ్నించారు. సోమవారం కలెక్టర్ విగ్రహం వద్ద నుంచి కలెక్టర్ ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహించి వినతిపత్రం అందజేయాలని తీర్మానం చేశారు. దళిత ప్రజా సంఘాలు , అభ్యుదయవాదులు, ప్రజాతంత్రవాదులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీవీఆర్‌సీ నాయకులు కోటి, దారా అంజయ్య, మేడిది రవి, బంటుపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌దుకాణాల వద్దే సరుకుల పంపిణీ

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ, అధికారులు

ఒంగోలు సబర్బన్: జూన్1 వ తేదీ నుంచి చౌక ధరల దుకాణాల వద్దే రేషన్ పంపిణీ చేస్తామని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. ప్రకాశం భవన్‌లోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో రేషన్ దుకాణాల అసోసియేషన్ నాయకులతో శనివారం సమావేశం నిర్వహిచంచారు. సమావేశంలో నూతనంగా అవలంబిస్తున్న విధానం గురించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీలో ప్రభుత్వం లోటుపాట్లను గుర్తించి, తిరిగి పాత పద్ధతినే అమల్లోకి తెచ్చిందన్నారు. చౌక ధరల దుకాణాలు శుభ్రంగా ఉంచుకోవాలని, కార్డుదారులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని సూచనలు చేశారు. ఎండీయూ వాహన ఆపరేటర్ నుండి ఈ–పాస్ మెషిన్, కాటా, ఐరిస్ మెషిన్లను తీసుకోవాలని సూచించారు. కార్డుదారులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, సాయంత్రం 4.00 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు కార్డుదారులకు పంపిణీ చేయాలన్నారు. మధ్యాహ్నం 12.00 గంటల నుంచి సాయంత్రం 4.00 వరకు 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులకు వారి ఇంటి వద్దకు వెళ్లి సరుకులు పంపిణీ చేయాలన్నారు. సరుకులను పక్కదారి పట్టిస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఎస్.పద్మశ్రీ, జిల్లా మేనేజర్ వరలక్ష్మి, సహాయ పౌర సరఫరా అధికారి, ఏఎం అకౌంట్స్, సీఎస్ డీటీలు, ఎఫ్ఎల్ఎస్, ఎంఎల్ఎస్ ఇన్‌చార్జ్‌లు, మండల ప్రెసిడెంట్, సెక్రటరీలు పాల్గొన్నారు.